క్లుప్తంగా

నిత్యావసరాల ధరలు పెంచిన బీజేపీని ఓడించాలి

ఒంగోలు టౌన్: దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెంచి నిరుపేద, సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా చట్టాలు చేసిన మోదీ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 44 కార్మిక చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చారని, 2019 మోటార్ వెహికల్ చట్టం, 2020 విద్యుత్ చట్టాలు చేయడం ద్వారా పేదల బతుకులు దుర్భరంగా తయారయ్యాయని చెప్పారు. గ్రామీణ ప్రజల ఉపాధి దెబ్బ తీస్తూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని, మద్దతు ధర ఇవ్వకుండా వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. దేశంలోని ప్రజల మధ్య మత విద్వేషాలు రాజేసి పబ్బం గడుపుకుంటున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో ఈదర అన్నపూర్ణ, ఎం.రమేష్, బంకా సుబ్బారావు, తాండవ రంగారావు, రఫీ, మహేష్, చిరంజీవి, ఆంజనేయులు, గంటినపల్లి శ్రీనివాసులు, జీవీ కొండారెడ్డి, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబాలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ముండ్లమూరు: కస్తూరిబా పాఠశాలలో ఖాళీగా ఉన్న పలు తరగతుల్లోని సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు కోరారు. ముండ్లమూరు కస్తూరిబా పాఠశాలలో ఆరో తరగతిలో 40 సీట్లు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ఒక్కో సీటు చొప్పున, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ ఆవుల సునీత తెలిపారు. వెబ్ సైట్‌ను సందర్శించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

తాళ్లూరు: స్థానిక కస్తూరిబాలో 6వ తరగతిలో 40 సీట్లు, ఏడు, తొమ్మిది తరగతుల్లో ఒక్కో సీటు చొప్పున ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ సుజిత తెలిపారు. ఇంటర్ బైపీసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మార్చి 13 నుంచి ఏప్రియల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు 8515838862, 9515322063 నంబర్లను పాఠశాలల సమయాల్లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన అమలక లక్ష్మీనారాయణస్వామి సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత అమలక లక్ష్మీ నారాయణస్వామి రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంలో ప్రతిష్ఠించారు. అనంతరం జవహర్ నగర్ కాలనీలోని పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. భక్తులు రథోత్సవంలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ డి.కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు చెంచయ్య తదితరులు పర్యవేక్షించారు.

గెలిపించండి.. అభివృద్ధి చేస్తా...



ఇలపావులూరులో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున



పార్టీలో చేరిన వారితో మంత్రి మేరుగు నాగార్జున

● మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని, అభివృద్ధి చేస్తానని వైఎస్సార్ సీపీ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాత్రి చీమకుర్తి మండలంలోని ఇలపావులూరు, గాడిపర్తివారిపాలెం, నేకునంబాద్, ఎర్రగుడిపాడు, మంచికలపాడు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ప్రతిఒక్కరు పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, నాయకులు జీ ఓబుల్‌రెడ్డి, దాసరి లక్ష్మీనారాయణ, పులి వెంకటరెడ్డి, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మైనంపాడులో కార్యకర్తలతో మాట్లాడుతున్న దుంపా చెంచిరెడ్డి

మైనంపాడులో కార్యకర్తలతో సమీక్ష...

వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దుంపా యలమందారెడ్డి మైనంపాడు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యేగా మేరుగు నాగార్జునను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. మైనంపాడుకు చెందిన గొడుగు మస్తాన్, గొడుగు కాలేషా, జీ సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 10 కుటుంబాలు...

చీమకుర్తి మండలంలోని తొర్రగుడిపాడు, ఎర్రగుడిపాడు గ్రామాల్లో 10 కుటుంబాల వారు మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి మంత్రి ఆహ్వానించారు.

మంత్రి మేరుగుకు యువత అభినందనలు



మంత్రి మేరుగు నాగార్జునకు అభినందనలు తెలుపుతున్న యూత్‌ఫోర్స్ సభ్యులు

మద్దిపాడు: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జునకు వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ టికెట్ కేటాయించడంపై ఇనమనమెళ్లూరు వాకా కోటిరెడ్డి యూత్‌ఫోర్స్ సభ్యులు ఒంగోలులోని మంత్రి కార్యాలయంలో సోమవారం కలిసి శాలువా కప్పి బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. వాకా కోటిరెడ్డి ఆధ్వర్యంలో కలిసిన యువత మాట్లాడుతూ పార్టీని పటిష్టం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని మంత్రికి తెలిపారు. భారీ మెజార్టీ తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో గంటా యహోషువా, చిరంజీవి, వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు యాదాల వెంకట్రావు, ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.

బాలినేని ప్రణీత్‌రెడ్డికి సత్కారం

ఒంగోలు: వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన పిల్లి ప్రసాద్, జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శిగా నియమితుడైన కసుకుర్తి దుర్గాప్రసాద్ సోమవారం ఆ పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డిని కలిసి సత్కరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడు కాకుమాను సునీల్‌రాజ్, నత్తల భీమేష్ పాల్గొన్నారు.



ప్రణీత్‌రెడ్డిని సత్కరిస్తున్న పిల్లి ప్రసాద్, కసుకుర్తి దుర్గాప్రసాద్

ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలి

● డ్వామా పీడీ అర్జునరావు

మద్దిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూలీలంతా వినియోగించుకుని లబ్ధిపొందాలని డ్వామా పీడీ అర్జునరావు సూచించారు. మండలంలోని అన్నంగి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ప్రతిఒక్కరూ నిబంధనల మేరకు పనులు చేసి రూ.272 వరకూ గరిష్టంగా కూలి పొందవచ్చని తెలిపారు. కూలీల అవకాశం మేరకు ఉదయంగానీ సాయంత్రంగానీ పనులు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రూ.250కి తగ్గకుండా పనులు చేసుకుని ఉపాధి పొందాలన్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటు అమ్ముకోరాదని హితవు పలికారు. ఉపాధి హామీ కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ఏపీఓ ధనుంజయవర్మ, ఈసీ కిషోర్, టెక్నికల్ అసిస్టెంట్లు స్వాతి, సోమేశ్వరరావు, హనుమాన్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయలక్ష్మి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



కూలీల రిజిస్టర్ పరిశీలిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

నిబంధనల మేరకు ముద్రించాలి



ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

● ప్రింటింగ్ ప్రెస్‌లకు సూచించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, బ్యానర్లు తదితర ప్రచార సామగ్రిని ముద్రించే సమయంలో తప్పనిసరిగా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు సూచించారు. ప్రకాశం భవనంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు, అసోసియేషన్ ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ సెక్షన్ 127 ప్రకారం ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించే సమయంలో ప్రింటర్, పబ్లిషర్ పేర్లు, చిరునామాలు లేకుండా కరపత్రాలు, పోస్టర్లు ముద్రించకూడదన్నారు. ఈ విషయం ప్రింటర్లు తప్పక పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రచార ముద్రణలు చేసేటప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన అపెండెక్స్-ఏ, బీ ప్రొఫార్మాలో డిక్లరేషన్ అందజేయాలన్నారు. ముద్రించిన తర్వాత మూడు రోజుల్లో ముద్రణకు సంబంధించిన వివరాలను ఎన్నికల విభాగానికి సమర్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, సెక్రటరీ శ్రీధర్, ప్రింటర్లు బాలాజి సింగ్, శ్రీకాంత్ ఇతర ప్రింటర్లు పాల్గొన్నారు.

వైభవంగా విజయదుర్గ అమ్మవారి రథోత్సవం



అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని విజయదుర్గా అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నుంచి మొదలైన అమ్మవారి త్రయాహ్నిక దీక్ష వార్షిక మహాకుంభాభిషేకంలో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించారు. మట్టా వెంకట సుబ్బారావు, కందేపి సుధాకర్, మట్టా చంద్రశేఖర్, కందేపి బంగారయ్య, పాలకవర్గం నిర్వహణలో ఆలయ ప్రధాన అర్చకుడు వేద సాయి ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటలకు గణపతి పూజ, మహన్యాసము, విజయదుర్గ అమ్మవారికి విశేష ద్రవ్యములతో 108 కలశములతో పంచామృత అభిషేకం, ఆలయ శిఖరమునందున మహా కుంభాభిషేకం, నవరణ, అర్చన పూర్ణాహుతి, అమ్మవారికి విశేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం చక్కగా అలంకరించిన అమ్మవారి దివ్యదర్శనం, హారతి, మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం విజయదుర్గ అమ్మవారికి చతుర్వేద స్వస్తి, వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ చేసి సుహాసినిలచే అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మధ్యాహ్నం ఎండలో బయట తిరగొద్దు

ఒంగోలు టౌన్: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య ఎండలో బయట తిరగవద్దని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.తిరుమలరావు సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు సహకారంతో వైద్య విద్యార్థులు వడదెబ్బ నివారణ చర్యలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముంగమూరుడొంక పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి శివప్రసాద్ కాలనీ వరకు వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు, పోస్టు గ్రాడ్యుయేట్లతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భగీరధి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిరుమలరావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరిగిపోతున్న నేపథ్యంలో పిల్లలు, పెద్దలు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని, దాహమేసినా.. లేకపోయినా తరచూ మంచినీళ్లు తాగుతూ ఉండాలని చెప్పారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడిన ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, ఉదయం, సాయంత్రం మాత్రమే ఇంటి కిటికీలు, తలుపులు తెరవాలని, ఎండతీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్న సమయంలో కిటికీలు తెరవవద్దని చెప్పారు. ఓఆర్ఎస్, ఇతర ఆహార పానియాలను ఇళ్లల్లో సిద్ధంగా ఉంచుకోవాలని డాక్టర్ భగీరధి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతి ఇంటికి తిరిగి ఎండా కాలంలో వడదెబ్బ తగలడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెల్త్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు హిమబిందు, సత్యశ్రీ, ప్రేమ, వెంకటేశ్వర్లు, రవిశంకర్, హౌస్ సర్జన్లు అభిజిత్, తేజ, వినోద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



వడదెబ్బపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ తిరుమలరావు

పేస్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఒంగోలు: గోద్రేజ్ కన్జ్యూమర్స్ కంపెనీలో తమ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకున్నారని పేస్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. సోమవారం కాలేజీలో చెన్నైకి చెందిన గోద్రేజ్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. అందులో పేస్ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కంపెనీ వారు మొదటగా రాత పరీక్ష, టెక్నికల్ టెస్ట్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. మొత్తం ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వార్షిక ఆదాయం రూ.3 లక్షలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొంటూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. తమ కాలేజీలో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ ప్రథమ సంవత్సరం నుంచే ఇస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కోటిరెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



కొత్తపట్నం హైస్కూల్ వద్ద పరీక్షకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలో, తెల్లబాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 209 మందికిగానూ 199 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూనియర్ కళాశాల ఆవరణలో 131 మందికిగానూ 130 మంది హాజరయ్యారు. తెల్లబాడు పాఠశాలలో 202 మందికిగానూ 194 మంది హాజరైనట్లు ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, వైద్య సదుపాయం కల్పించామని తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి వీలుగా పాఠశాలకు 100 మీటర్ల దూరం వరకూ 144వ సెక్షన్ విధించినట్లు ఎస్సై వెలగా మహేష్ తెలిపారు. మద్దిపాడులోని ఏబీ సెంటర్లు, తెల్లబాడులోని సీ సెంటర్‌ను ఎస్సై పరిశీలించారు.

కొత్తపట్నం మండలంలో 650 మంది విద్యార్థులు హాజరు

కొత్తపట్నం: మండలంలోని హైస్కూళ్లలో సోమవారం మొదటిరోజు జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 661 మందికిగానూ 11 మంది గైర్హాజరయ్యారు. కొత్తపట్నం హైస్కూల్లో ఏ, బీ అనే రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏ కేంద్రంలో 240 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 235 మంది హాజరయ్యారు. బీ కేంద్రంలో రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి 223 మంది విద్యార్థులకుగానూ 219 మంది హాజరయ్యారు. ఈతముక్కల హైస్కూల్లో రెగ్యులర్ విద్యార్థులు 190 మందికిగానూ 188 హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 8 మంది పరీక్ష రాశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించారు.

ఒంగోలు రూరల్ మండలంలో...

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది సెంటర్‌లో గుండాయపాలెం, ఉలిచి, కరవది విద్యార్థులు మొత్తం 110 మంది తొలిరోజు తెలుగు పరీక్షకు హాజరయ్యారు. త్రోవగుంట పరీక్ష కేంద్రంలో త్రోవగుంట హైస్కూల్, ముక్తినూతలపాడు హైస్కూల్ కలిపి మొత్తం 190 మంది పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు రాకపోకలు నిషేధించారు. సమీపంలోని జెరాక్స్ సెంటర్లు, నెట్‌పాయింట్లు మూసివేయించారు. ఉదయం పరీక్ష ప్రారంభం కాగానే డిప్యూటీ డీఈవో అనితరోజ్ త్రోవగుంట సెంటర్‌ను సందర్శించి పరిశీలించారు. అనంతరం కరవది జెడ్పీహైస్కూలు సెంటర్‌ను పరిశీలించారు. పరీక్షల రాష్ట్ర అబ్జర్వర్, స్టేట్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ కరవది జెడ్పీహైస్కూలును ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా స్క్వాడ్ అధికారిణి, డిప్యూటీ అధికారిని పాఠశాలలోనే గంటన్నర పాటు ఉండి పరిశీలించారు. చేజర్ల గ్రామానికి చెందిన విద్యార్థిని జ్వరంతో పరీక్షకు హాజరై స్పృహ తప్పి పడిపోగా, వైద్య సిబ్బంది చికిత్స చేశారు. స్పృహలోకి రాకపోవడంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేశారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేతలు

దర్శి: టీడీపీలో ఎదుగుబొదుగు లేక విసిగి వేసారిపోయిన సీనియర్ నాయకులు నీలిశెట్టి వెంకట్రావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి సమక్షంలో ఆ పార్టీలో సోమవారం చేరారు. కృష్ణబలిజ సంఘం కార్యదర్శి నీలిశెట్టి వెంకట్రావు, ఠాగూర్‌లను శివప్రసాదరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, కుల, మత, పార్టీ, వర్గ బేదాలు చూడకుండా అందరికీ ఆ ఫలాలను అందించటం అభినందనీయమన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ బూచేపల్లి

బధిరుల పాఠశాలకు కంప్యూటర్లు అందజేత

చీమకుర్తి: మండలంలోని రామతీర్థంలో గల ఏపీ మిడ్‌వెస్ట్ గ్రానైట్ కంపెనీ ఆర్థిక సహకారంతో చీమకుర్తిలోని బధిరుల పాఠశాలకు 4 కంప్యూటర్లు, డిజిటల్ టీవీని సోమవారం అందించారు. క్వారీ జీఎం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎండీ కే రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ తమ క్వారీ తరఫున అందించిన కంప్యూటర్లను బధిరుల పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



కంప్యూటర్లు అందిస్తున్న ఏపీ మిడ్‌వెస్ట్ గ్రానైట్ జీఎం

జగన్ సంక్షేమాన్ని కొనసాగించాలని అడుగుతాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమాదిగ

● మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు కృష్ణమాదిగ

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరుపేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలని టీడీపీ, బీజేపీ, జనసేన అధినాయకులను కోరతామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు మందా కృష్ణమాదిగ అన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవేళ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే ప్రస్తుతం సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తూనే గత ప్రభుత్వ హయాంలోని దళితుల పథకాలను కూడా పునరుద్ధరిస్తామన్న హామీ ఇవ్వాలన్నారు. చంద్రబాబు గత 5 ఏళ్ల పాలనలో అనేక తప్పటడుగులు వేశాడని, ఇప్పుడు వాటిని సరిదిద్దుకుంటాడని భావిస్తున్నామని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మూడోసారి కూడా ప్రధాన మంత్రిగా చూసేందుకు చివరి నిముషం వరకు అహర్నిశలు శ్రమిస్తామన్నారు. మోదీని గెలిపించుకోవడం మా ధర్మం, మా కర్తవ్యం అని వ్యాఖ్యానించారు. త్వరలోనే మాదిగల రాజకీయ నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.